క్లుప్తంగా

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో వేంచేసిన ధనమ్మతల్లి అమ్మవారి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవురోజు కావడంతో మండలంలోని గ్రామాలతో పాటు కె.గంగవరం, ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట మండలాలకు చెందిన భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ భార్గవ్, సంపర లక్ష్మీ నరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. స్వామివారిని పూలతో అలంకరించి పెండ్లికొడుకును చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ నెల 16 వరకూ కల్యాణ ఉత్సవాలు కొనసాగుతాయని ఈఓ ఎం.రాంబాబురెడ్డి తెలిపారు.

సత్తెమ్మతల్లి మందిరంలో ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలోని 20వ వార్డు వైఎస్సార్ కాలనీలో వేంచేసిన సత్తెమ్మతల్లి మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అమ్మవారిని దర్శించుకున్నారు. సత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన


వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లిలో ఉమా సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఆదివారం వాటర్ ప్లాంట్ నిర్మాణానికి గ్రామపెద్దలు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు కాకినాడకు చెందిన కోరమాండల్ కంపెనీ సోమేశ్వర స్వామి ఆలయం వద్ద వాటర్ ప్లాంట్ బిల్డింగ్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా కోరమాండల్ జనరల్ మేనేజర్ పి.పద్మనాభం తదితరులు శంకుస్థాపన చేశారు. దీనికి స్థలాన్ని గ్రామానికి చెందిన మాజీ మునసబు దివంగత తాడాల నరసింహం స్థలాన్ని ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు.

శలపాక జంక్షన్‌లో బస్‌షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో గొల్లపాలెంలోని శలపాక జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండలంలోని 10 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌లో గొల్లపాలెం, దేగలపేట, శలపాక, తణుకువాడ, మంజేరు తదితర గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు కాలినడకన, సైకిళ్లపైనా వచ్చి బస్సులెక్కుతుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో వీరికి సరైన షెల్టర్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపుల అరుగులపైనా దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పి.శ్రీకాంత్, పితాని ఆదినారాయణ, తదితర ప్రయాణికులు కోరుతున్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని ఆయన వివరించారు. కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పర్యవేక్షణ లోపం.. ప్రజలకు శాపం

- ఇష్టారీతిగా పైప్‌లైన్లు వేసిన కాంట్రాక్టర్
- నడిరోడ్డుపై పైపుల ఏర్పాటు
- రోడ్లు ధ్వంసం


ద్రాక్షారామ రిజిస్ట్రేషన్ ఆఫీస్ సమీపంలో జేసీబీతో అంచును బద్దలు కొట్టిన రోడ్డు అలాగే వదిలేసిన దృశ్యం


ద్రాక్షారామ పైడా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ వెనుక బద్దలుగొట్టిన సీసీ రోడ్డు అలాగే వదిలి వేసిన దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో రూ.166.50 లక్షలతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా 6.5 కిలోమీటర్ల పైపులైన్ ఏర్పాటుకు చేసిన పనులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. పైపులైన్ నిర్మాణ పనులు సాధారణంగా లేబర్‌తో చేపడతారు. అయితే అందుకు విరుద్ధంగా జేసీబీతో సీసీ రోడ్లను ఛిద్రం చేసి, పైపు లైన్ ఏర్పాటు చేశారు. పైపులైన్ కోసం చేసే తవ్వకాలు ఒక మీటరు మేర తవ్వి, అక్కడి నుంచి సుమారు 3 మీటర్ల మేర భూమి లోపల నుంచి రంధ్రం చేసి పైపులను చొప్పిస్తారు. కానీ ఆ విధంగా కాకుండా మొత్తం రోడ్డును జేసీబీతో తవ్వి పైపులైన్ ఏర్పాటు చేసి పని త్వరగా పూర్తి చేయడానికి సులువైన మార్గంగా పనులు చేసేశారు. రోడ్డు అంచును తొలగించకూడదని నిబంధనలు చెబుతున్నా రోడ్డు అంచును కూడా ఛిద్రం చేయడమే కాకుండా కొన్ని చోట్ల రోడ్డు మధ్యలో కూడా జేసీబీతో గాడులు చేసి పైపులైన్ చొప్పించారు. ఆ రోడ్డు మధ్య నుంచే పైపులైన్ ఏర్పాటు చేసి తమ పని పూర్తయిందనిపించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్డు మధ్యలోనే పైప్‌లైన్ ఏర్పాటు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంలా పరిణమించింది. ప్రధాన రహదారిలో తవ్విన చోట్లలో సీసీ రోడ్డును వేసినా కొన్ని సందుల్లో మాత్రం బద్దలు కొట్టిన రోడ్లను అలానే వదిలి వేశారు. విచిత్రం ఏంటంటే రోడ్లు తవ్వి పైపులైన్లు వేసిన చోట్లలో తిరిగి రోడ్లు వేయడానికే సుమారు రూ.20 లక్షలు నిధులు ఖర్చయ్యాయని అధికారులు చెబుతున్నారు.

ఛిద్రమైన రోడ్లు బాగు చేయాలి



పైపు లైన్ నిర్మాణంలో జేసీబీతో ఛిద్రం చేసిన రోడ్లను తిరిగి బాగు చేయాలి. రోడ్డు మధ్యలో వేసిన పైపు లైన్‌ల వల్ల అటు ఆ రోడ్లపై ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడే ప్రమాదంతో పాటు తాగునీరు సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదం కూడా ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దీనిపై దృష్టి పెట్టి సమస్యలను సరి చేయాలి.

– నరాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ, ద్రాక్షారామ

సరి చేయిస్తాం..



ప్రజలకు ఇబ్బంది కలిగేలా పైపు లైన్లు ఎక్కడ ఎక్కడ ఉన్నాయో గుర్తించి సరి చేయిస్తాం. రోడ్లు పాడైన చోట్లలో కొన్నిచోట్ల రోడ్లను వేశాం. మరికొన్ని చోట్ల వేయనట్టయితే పరిశీలించి అక్కడ కూడా తిరిగి రోడ్లు సరిగా వేసేలా చర్యలు చేపడతాం.

– ఎస్.రాహుల్, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రామచంద్రపురం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు యల్లంపంపు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 5 వేల మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీటీసీ కణితి వెంకటేశ్వరి, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, సుబ్బారావు దంపతులు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాసరావు, బత్తుల అప్పారావు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


ధ్వజ స్తంభానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు


సీతారాములను దర్శించుకుంటున్న నేతలు

మంపపేట: సీతారాముల అనుగ్రహంతో పాలతోడు గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆకాంక్షించారు. మండలంలోని పాలతోడు శెట్టిబలిజ కాలనీలో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి సీతారాముల ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

పండితులు ప్రత్యేక పూజలు చేసి సీతారాముల రాతి విగ్రహాలు, వినాయక, ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, ఆలయశిఖరం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. స్థానిక, చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వెఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పిల్లా అరవరాజు, పార్టీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, ఉపసర్పంచ్ గుత్తుల సూర్యనారాయణ, గుత్తుల శివకుమార్, తుమ్మా వీరబాబు, పిల్లా సూరిబాబు, వైఎస్సార్ నాయకులు గొలుగూరి భాస్కరరెడ్డి, నల్లమిల్లి వీర్రెడ్డి, యరగతపు బాబ్జి పాల్గొన్నారు.

పార్టీ పూర్వ వైభవానికి కృషి


సమావేశంలో పాల్గొన్న బీసీ నేతలు

కాజులూరు: నియోజకవర్గంలో పార్టీ పూర్వ వైభవానికి బీసీ నేతలు కృషి చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం గొల్లపాలెం సుబ్రహ్మణ్యం మండల గ్రామాలకు చెందిన బీసీ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి బీసీలే వెన్నుముక అన్నారు. కూటమి నేతల నిర్లక్ష్య పాలనలో బీసీలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీసీ నేతలందరూ వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ సభ్యులు చొల్లంగి రమణ, గుత్తుల లోవరాజు, గుత్తుల ఈశ్వరరావు, చింతా నవీన్, పెంకే దుర్గాప్రసాద్, పాలిక వీరబాబు, సువ్వారి గోవిందు, దంగేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లే వ్యాధులకు కారణం

కాజులూరు: సమాజంలో మనిషి ఆహారపు అలవాట్లే ప్రధానంగా వారిలో వ్యాధులకు కారణమౌతాయని కాకినాడ మౌర్య హాస్పిటల్ వైద్యుడు పుల్ల ప్రసాద్ అన్నారు. గొల్లపాలెంలోని కమ్యూనిటీ పారామెడికల్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ (పీఎంపీ అసోసియేషన్) భవనంలో కాజులూరు, కరప మండల యూనిట్ అధ్యక్షుడు జీవీవీ సూర్యనారాయణ అధ్యక్షతన పలు వ్యాధులపై నిపుణులైన వైద్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. పుల్ల ప్రసాద్ మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాధుల లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై పీఎంపీ వైద్యులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. మనిషి ప్రతిరోజు శరీర బరువుని బట్టి మూడు నుంచి నాలుగు లీటర్ల తాగునీరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పాక శివప్రసాద రావు, రాష్ట్ర నాయకుడు కేఎస్ఎన్ బాబు, సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, మండల కార్యదర్శి ఆర్.వినయ్ కుమార్, సంఘం నాయకులు కేఎస్ ఆచార్యులు, మండల గ్రామాలకు చెందిన పలువురు పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

కమ్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన అధ్యక్షుడు రాజబాబుతో సంఘ సభ్యులు


రాజబాబును అభినందిస్తున్న అభిమానులు

మండపేట: మండపేట కమ్మ మహాజన సంఘ నూతన కార్యవర్గం ఆదివారం కొలువుతీరింది. సంఘ అధ్యక్షుడిగా మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎంపీఎస్ విద్యాసంస్థల అధినేత వల్లూరి చిన్నారావును ఎన్నుకున్నారు. కలువపువ్వు సెంటర్‌లో శ్రీరెడ్డి వెంకయ్య కమ్మ మహాజన సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులతో పాటు గౌరవాధ్యక్షులుగా మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, పారిశ్రామికవేత్త వీవీవీఎస్ చౌదరి (మాధవిబాబు), మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకుడు వల్లూరి విజయానంద పార్థసారథి, రెడ్డి అమరనాథ్‌లను నియమించారు. వీరితో పాటు సంఘ ఉపాధ్యక్షుడిగా రెడ్డి పుల్లాజీ, సంయుక్త కార్యదర్శిగా మల్లిపూడి గణేశ్వరరావు, కోశాధికారిగా వల్లూరి రామన్న చౌదరి, కార్యవర్గ సభ్యులుగా యలమాల కొండ, చుండ్రు పవన్, కొప్పాక సత్యనారాయణ (విజ్ఞాన్ బాబి), చుండ్రు కుమార్, వేగుళ్ల పాపయ్య, పాలచర్ల బ్రహ్మాజీ చౌదరి, ములకల రామకృష్ణ, చుండ్రు అగస్త్యరాజ్‌లను ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడు రాజబాబు మాట్లాడుతూ సంఘ అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు.

రాధాకృష్ణకు అభినందనలు

మండపేట: మండపేట కమ్మ మహాజన సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు)కు ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, లీగల్ సెల్ కన్వీనర్ టీవీ గోవిందరావు ఆదివారం నాళంవారి వీధిలోని రాజబాబు కార్యాలయానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కమ్మ సామాజికవర్గీయులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అలాగే వద్రంగి సంఘం అధ్యక్షుడు గోడి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రామోజి కృష్ణ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

960 మందికి ఉచిత వైద్య సేవలు

మామిడికుదురు: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మల్టీ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 960 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. సత్యసాయి మొబైల్ వ్యాను ద్వారా 350 మందికి ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేశారు. 92 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. 10 మందికి కంటి శుక్లాలు ఆపరేషన్ల కోసం గుర్తించారు. స్కూల్ పూర్వ విద్యార్థి కడలి గోపాలకృష్ణ, భారతి దంపతులు ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించి, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. గుండె వైద్య నిపుణులు అభిషేక్ వర్మ, గురుకిరణ్, బి.రాఘవేంద్రరావుతో పాటు పలు విభాగాలకు చెందిన నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సుమారు 25 విభాగాలకు చెందిన నిపుణులు ఉచితంగా వైద్య సేవలందించారు. సుమారు రూ.70 వేలు విలువైన మందులను ఉచితంగా అందజేశారు. శిబిరంలో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో అమలాపురం జోన్ కన్వీనర్ జి.ప్రభాకర్, కాశిన ప్రభాకర్, పర్వత వర్ధనరావు, నెక్కంటి లక్ష్మి, లక్కింశెట్టి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పార్కులు


బురుగుంట చెరువు పార్కులో పట్టపగలే మద్యం తాగుతున్న యువకులు


పార్కులో బీరు తాగుతున్న యువకుడు

- విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలు
- పెడదోవ పడుతున్న యువత
- అసౌకర్యానికి గురవుతున్న సందర్శకులు
- పోలీసులు దృష్టి సారించాలని విజ్ఞప్తి

మండపేట: సోషల్ మీడియా పుణ్యమా అని యువకులు, విద్యార్థులు పాశ్చాత్య సంస్కృతి పిచ్చిలో మునిగి తేలుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రాం, షేర్‌చాట్, యూ ట్యూబ్ వంటి వేదికల్లో వచ్చే రీల్స్‌ను చూస్తూ అందులో వచ్చే సన్నివేశాలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రవర్తిస్తున్నారు. ఈ విష సంస్కృతి కాలక్రమేణా పట్టణాలు, గ్రామాలకు సైతం వ్యాపిస్తోంది. మండపేట పట్టణంలో యువత బరితెగించి ప్రవర్తిస్తున్నారు. వీరి కార్యకలాపాలకు దూర ప్రాంతాల్లో వుండే ఖాళీ స్థలాలే కాకుండా పట్టణ నడిబొడ్డున ఉన్న మున్సిపల్ పార్కులను సైతం వదలడం లేదు. ఓ పక్క బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కులో యువకులు మందు కొడుతూ చిందులు వేస్తుంటే, మరో పక్క ధర్మగుండం చెరువు చంద్రబాబు ఉద్యానవనం లవర్స్ పార్కులా రూపాంతరం చెందింది. పట్టణంలో ఈ రెండు పార్కులకు సందర్శకుల తాకిడి అధికంగా ఉంటోంది. ఇక్కడ చూడముచ్చటైన చెరువులు, వాటి చుట్టూ నిర్మించిన అందమైన పార్కులు, వాకింగ్ ట్రాక్, పార్కులకు నాలుగు వైపులా ద్వారాలు పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించేందుకు చెట్ల మధ్యలో అనువైన సిమెంట్ బల్లలు ఉన్నాయి. ఇన్ని సౌకర్యాలున్న పార్కులను ఆకతాయిలు, కొంత మంది యువతీయువకులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేసి సందర్శకులను అసౌకర్యానికి గురి చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో..

ఈ పార్కులు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ పట్టణ ప్రజల కోసం తెరచి ఉంచుతారు. ఈలోగా పార్కు మూసేసిన వేళల్లో కుర్రకారు రెచ్చిపోతున్నారు. బురుగుంట చెరువు పార్కు పక్కనే మద్యం దుకాణం ఉండడంతో ఆ పార్కు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. పార్కులు మూసి ఉన్నప్పటికీ పార్కు గోడలు దూకి మరీ లోపలకు ప్రవేశించి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. మధ్యాహ్నం వేళల్లో అయితే ఇంటర్మీడియెట్ యువకులు పార్కులోకి ప్రవేశించి బరితెగిస్తున్నారు. ధర్మగుండం పార్కు వెనకభాగం మయూరి వృద్ధాశ్రమం గోడ, సీతారామా కల్యాణ మండపం ఎదురుగా ఉన్న గోడలు దూకేసి విచ్చలవిడితనంతో వయసుకు మించిన పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మైనర్‌లు సైతం మద్యానికి, సిగరెట్లకు బానిసలై మధ్యాహ్న సమయంలో పార్కుల వెంబడి తిరుగుతున్నారు. ఆయా పాఠశాలలు, కాలేజీల నుంచి తప్పించుకుని స్కూల్ యూనిఫాంతో పార్కుల్లో తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా పోలీసులు దృష్టి సారించి పెడదోవ పడుతున్న యువతను క్రమశిక్షణలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రబీకి నీటి ఎద్దడి రాకుండా చర్యలు


కొమరాడలో జరిగిన సమావేశంలో పాల్గొన్న చైర్మన్ కృష్ణమోహన్

మామిడికుదురు: రబీ పంటకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామని తాటిపాక నీటి సంఘం అధ్యక్షులు కడలి కృష్ణమోహన్ తెలిపారు. కొమరాడలో ఆదివారం నీటి సంఘం సమావేశం జరిగింది. పంట కాలువల పరిధిలో సాగునీటి సమస్య రాకుండా డైరెక్టర్లు బాధ్యత తీసుకోవాలని కృష్ణమోహన్ సూచించారు. రైతులతో ఎప్పటికప్పుడు మమేకమవుతూ సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు రైతులకు ఏ విధమైన సమస్యలు ఉన్న వాటిని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రబీ సీజన్ ముగిసిన వెంటనే పంట కాలువల్లో పూడిక తొలగించి, అవసరమైన ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, వంతెనలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో పాటు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు అప్పారి వెంకటేశ్వరరావు, నేదూరి శ్రీనివాసరావు, చేగొండి పద్మావతి, జక్కంపూడి సూర్యప్రకాష్‌రావు, పులఖండం సీత, ఆకుల మల్లేశ్వరరావు, విత్తనాల త్రిమూర్తులు, అనుసూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

GENERAL PUBLICATION

UNDER THE INSTRUCTIONS FROM OUR CLIENT M/S. SHRIRAM FINANCE LTD. REGD OFFICE AT CHENNAI, AND BRANCH OFFICE AT MANDAPETA, WE ISSUE THIS NOTICE TO THE GENERAL PUBLIC. OUR CLIENT IS INTEND TO ADVANCE LOAN TO PULIDINDI LAKSHMI WIFE OF VISWANADHAM, RESIDENT OF DOOR NO. 4-57, VELAMPALEM VILLAGE, RAMACHANDRAPURAM MANDAL, EAST GODAVARI DISTRICT, ... Who agreed to create equitable mortgage relating to the under mentioned schedule property exclusively belongs to him. The public is here by informed that if anybody has got any objection in respect of the Mortgage of the schedule properties. Kindly contact under mentioned address within one week. Otherwise, same is treated as no objection.

SCHEDULE

AS PER REGD SALE DEED DATED 07-05-2012 VIDE DOCUMENT NO. 1245 OF 2012 OF DRAKSHARAMA SRO. EAST GODAVARI DISTRICT, RAMACHANDRAPURAM MANDAL, SRO DRAKSHARAMA village VELAMPALEM VILLAGE WITH IN VELAMPALEM GRAMA PANCHAYATH AREA ... Within the above boundaries for an extent of 193-6 sq. yards of site with all usual ways, pathways, water ways with all easementary rights ETC.

TANTRAVAHI SUBBA RAO & R.V.G. SUBBA RAO, ADVOCATES.

GENERAL PUBLICATION

UNDER THE INSTRUCTIONS FROM OUR CLIENT M/S. SHRIRAM FINANCE LTD. REGD OFFICE AT CHENNAI, AND BRANCH OFFICE AT MANDAPETA, WE ISSUE THIS NOTICE TO THE GENERAL PUBLIC. OUR CLIENT IS INTEND TO ADVANCE LOAN TO KOTNI DURGA BHAVANI WIFE OF SATTI BABU, RESIDENT OF DOOR NO. 14-11-15, RAMACHANDRAPURAM TOWN, RAMACHANDRAPURAM MANDAL, EAST GODAVARI DISTRICT, ... Who agreed to create equitable mortgage relating to the under mentioned schedule property exclusively belongs to him. The public is here by informed that if anybody has got any objection in respect of the Mortgage of the schedule properties. Kindly contact under mentioned address within one week. Otherwise, same is treated as no objection.

SCHEDULE

AS PER REGD SALE DEED DATED 26-04-2012 VIDE DOCUMENT NO. 1463 OF 2012 OF RAMACHANDRAPURAM SRO. EAST GODAVARI DISTRICT, RAMACHANDRAPURAM MANDAL, SRO RAMACHANDRAPURAM village YERUPALLI VILLAGE WITH IN YERUPALLI GRAMA PANCHAYATH AREA ... with all usual ways, pathways, water ways with all easementary rights ETC.

TANTRAVAHI SUBBA RAO & R.V.G. SUBBA RAO, ADVOCATES.